సాక్షి
పశ్చిమగోదావరి

శుక్రవారం । 15 । నవంబర్ । 2024



అంతర్రాష్ట్ర నేరస్తుడి అరెస్ట్

జంగారెడ్డిగూడెంలో గురువారం అంతర్రాష్ట్ర నేరస్తుడు పట్టుబడ్డాడు. అతడిపై తెలుగు రాష్ట్రాల్లో సుమారు 80కిపైగా చోరీ కేసులు నమోదయ్యాయి.

8లో



గురుకుల పోటీలు ప్రారంభం

జోన్ 2 బాలికల గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ పోలసానిపల్లిలో ప్రారంభమైంది. 29 కళాశాలలకు చెందిన 1,050 మంది క్రీడాకారులు హాజరయ్యారు.

8లో



స్మార్ట్ మీటర్లు ఆపాలి

విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఆపాలని, విద్యుత్ చార్జీల భారాన్ని ఉపసంహరించుకోవాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి.


8లో

ప్రీమియం పిడుగు

పంటల బీమా.. లేదిక ధీమా

- ఉచిత పంటల బీమాకు మంగళం
- ప్రీమియం చెల్లిస్తేనే బీమా వర్తింపు
- జిల్లాలో 1.32 లక్షల మంది రైతులపై భారం
- జిల్లాలో 4.90 లక్షల ఎకరాల సాగు
- జీడిమామిడికి నేటితో ప్రీమియం గడువు ముగింపు





ఏలూరు(మెట్రో) : ఉచిత పంటల బీమా.. రైతులకు ధీమా అన్న మాటలను చెరిపేస్తూ పంటల బీమా.. లేదిక ధీమా అన్నట్టు కూటమి ప్రభుత్వం రైతుల నెత్తిన ప్రీమియం పిడుగు వేసింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పక్కాగా అమలుచేసిన ఉచిత పంటల బీమా పథకానికి మంగళం పాడుతూ రైతులు ప్రీమియం చెల్లిస్తేనే బీమా వర్తించేలా చర్యలు తీసుకుంది. దీంతో ఇకపై రైతులకు పంటల బీమా భారం కానుంది. రైతులు ఎకరాకు పంటల రకాన్ని బట్టి రూ.600కు వరకూ ప్రీమియాన్ని చెల్లించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో జీడిమామిడి పంటకు ప్రీమియం చెల్లింపు గడువు శుక్రవారంతో ముగియనుంది.

అన్నదాతా దుఃఖీభవ..!

సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా అన్నదాతా సుఖీభవ పథకం కింద ప్రభుత్వం రైతులకు ఏడాదికి రూ.20 వేల సాయం అందిస్తామని కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ఊదరగొట్టారు. తీరా అధికారం చేపట్టిన తర్వాత పెట్టుబడి సాయం ఊసెత్తకపోవడంతో రైతులు సాగు ఖర్చులకు అప్పులబాట పట్టాల్సి వస్తుంది. ఇటువంటి పరిస్థితుల్లో రైతులపై బీమా కత్తిని దూసేందుకు కూటమి సర్కారు సిద్ధమైంది.

పెట్టుబడులు భారంగా..

పెట్టుబడుల భారం రైతులను కుదేలు చేస్తోంది. గతంతో పోల్చుకుంటే రానురానూ పెట్టుబడి వ్యయం పెరుగుతోంది. పంట చేతికి వచ్చే దాకా అనిశ్చితి సైతం నెలకొంది. ఉచిత పంటల బీమా ఉంటే రైతులకు భరోసా ఉండేది. ఇప్పుడు ఆ స్థానంలో ప్రీమియం రైతులే కట్టుకోవాల్సి రావడంతో ఎకరాకు రూ.600 వరకు రైతు చెల్లించాల్సి ఉంటుంది. పెట్టుబడులకు ఇది అదనంగా, భారంగా రైతులకు పరిణమించింది. కూటమి ప్రభుత్వం అన్నదాతలపై పగ సాధిస్తుందని పలువురు రైతులు అంటున్నారు.

జగన్ హయాంలో రైతు సంక్షేమం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు చేదోడు వాదోడుగా ఉండేది. పెట్టుబడి సాయం, ఉచిత పంటల బీమా పథకం, ఆర్‌బీకేల ద్వారా వ్యవసాయ అవసరాలు తీర్చడం వంటి పనులు చేసింది. రైతులకు అత్యంత ప్రయోజకరంగా ఉచిత పంటల బీమా నిలిచింది. ఈ-క్రాప్ నమోదు చేయించుకుంటే చాలు పథకాన్ని అమలు చేసేలా చర్యలు తీసుకోవడంతో వరదలు, వర్షాలతో పంటలు దెబ్బతిని నష్టం వచ్చినా రైతులకు భారం తెలిసేది కాదు. బీమా ప్రీమియం సైతం రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించడంతో సాగు చేపట్టిన ప్రతి రైతు భరోసాతో ఉండేవారు. అలాగే ఏటా రైతు భరోసా కింద రైతుల ఖాతాల్లో జమ అయ్యే రూ.13,500 పంట సాగుకు ఊతంగా నిలిచేది. అయితే కూటమి ప్రభుత్వం అండగా ఉండాల్సింది పోయి గుదిబండగా మారుతుందని రైతులు వాపోతున్నారు.

జిల్లాలో 1,32,728 మంది రైతులు సుమారు 4.90 లక్షల ఎకరాల్లో పలు రకాల పంటలు సాగుచేస్తున్నారు. ప్రధానంగా వరి, ఆయిల్‌పామ్, మొక్కజొన్న, పత్తి, జీడిమామిడి, వేరుశనగ, మినుము, మామిడితో పాటు పొగాకు, అరటి, కోకో, కొబ్బరి వంటి పంటలు పండిస్తున్నారు. ఇదిలా ఉండగా పంటల బీమా ప్రీమియం గడువు చెల్లింపు గడువును ప్రభుత్వం ప్రకటించింది. జీడిమామిడి రైతులు ఈనెల 15వ తేదీలోపు ప్రీమియం చెల్లించాలని ప్రకటించింది. ఇక వరికి డిసెంబర్ 31, మొక్కజొన్న, పెసర, మినుముకు డిసెంబర్ 15న ప్రీమియం చెల్లింపులకు చివరి తేదీగా నిర్ణయించింది. ఎకరాకు వరికి రూ.500, మొక్కజొన్నకు రూ.483కు చొప్పున చెల్లించాలని కూటమి సర్కారు నిర్ణయించింది.

భారాన్ని మోయాల్సిందేనా..

రాష్ట్ర ప్రభుత్వ చర్యలతో ప్రీమియం భారాన్ని మోయాల్సిందేనా అని రైతులు ఆవేదన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వంపై గంపెడాశలు పెట్టుకున్న రైతులకు నిరాశే మిగులుతోంది. గతంలో రుణాలు తీసుకున్న రైతులకు సంబంధిత బ్యాంకులు, సొసైటీలు పంటల బీమా సొమ్ములు చెల్లించేవి. ఆ సొమ్ములను తర్వాత రైతుల నుంచి వసూలు చేసేవి. దీంతో ఏదైనా కారణాలతో పంట నష్టపోతే నష్టపరిహారం సదరు సంస్థల నుంచి అందేది. అయితే రుణాలు తీసుకోని రైతులకు ఈ అవకాశం ఉండేది కాదు. దీంతో గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందరి రైతులకు నష్టపరిహారం అందాలనే ఉద్దేశంతో ఉచిత బీమా పథకాన్ని అమలుచేసింది. క్షేత్రస్థాయిలో ఈ-క్రాప్ చేయించుకున్న ప్రతి రైతుకూ ఉచిత పంటల బీమా అమలు చేసింది. దీనిని కూటమి ప్రభుత్వం రద్దు చేసింది.

జిల్లాలో ప్రధాన పంటల సాగు

రకం	విస్తీర్ణం (ఎకరాల్లో..)
వరి	1,91,380
ఆయిల్‌పామ్	1,32,167
మొక్కజొన్న	90,000
మామిడి	35,937
జీడిమామిడి	14,821
పత్తి	7,359
మినుము	7,176
వేరుశనగ	4,150
రైతులు	1,32,728

న్యూస్‌రీల్

పుస్తక పఠనంతో విజ్ఞానం

కలెక్టర్ నాగరాణి



జ్యోతి ప్రజ్వలన చేసి గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం : పుస్తక పఠనం, గ్రంథాల అధ్యయనం ద్వారా విజ్ఞానం, మేధస్సు, వ్యక్తిత్వ వికాసం పొందవచ్చని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. పట్టణంలోని ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో గురువారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఆమె ప్రారంభించారు. మాజీ ప్రధాని నెహ్రూ, గ్రంథాలయ ఉద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పుస్తకాలను చదవడం అలవర్చుకోవాలని, గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇన్‌చార్జ్ గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అధినేతతో భేటీ

తాడేపల్లిగూడెం : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురాం మర్యాదపూర్వకంగా కలిశారు. కూటమి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి, రైతులకు చేసిన అన్యాయం గురించి చర్చించినట్టు వడ్డి చెప్పారు. కూటమి ప్రభుత్వంపై , రైతుల సమస్యలపై పోరాటం చేయడానికి కార్యాచరణ రూపొందిస్తున్నట్టు జగన్ చెప్పారన్నారు.

మద్యం షాపుపై మండిపాటు



గొల్లలకోడేరులో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

పాలకోడేరు: నివాసిత గృహాల మధ్య మద్యం షాపు ఏర్పాటుచేస్తే సహించేది లేదని గొల్లలకోడేరు గ్రామస్తులు, దళితులు ఆగ్రహం వేస్తూ గురువారం ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఏర్పాటు చేసే మద్యం షాపు సమీపంలోనే మంచినీటి చెరువు ఉందని అక్కడకు వెళ్లి మహిళలు ఎలా నీళ్ల తెచ్చుకుంటారన్నారు. అలాగే సమీపంలోనే ఆలయాలు ఉన్నాయని, విద్యార్థులకు కళాశాలలకు ఇటుగానే వెళ్లాలని, దళిత శ్మశాన వాటిక కూడా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం ఇక్కడ మద్యం దుకాణం ఏర్పాటును విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

తల్లికి వందనం ఎప్పుడు?



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఏలూరు (టూటౌన్): సూపర్‌సిక్స్ హామీల్లోని తల్లికి వందనం పథకం అమలు చేయలేదు కాని.. రాష్ట్రంలో నూతన మద్యం పాలసీ ద్వారా రూ.99కే నాన్నకి ఇంధనం మాత్రం అలందిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ఎద్దేవా చేశారు. సీపీఎం ప్రజాపోరు యాత్ర ముగింపులో భాగంగా నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేశారు. నగర కార్యదర్శి పి.కిషోర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నూతన మద్యం పాలసీని తీసుకువచ్చి ఊరూరా బెల్టుషాపులు పెడుతున్నారని, నూతన మద్యం పాలసీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలపై భారం మోపేలా విద్యుత్ స్మార్ట్‌మీటర్లు బిగిస్తున్నారన్నారు. ఇసుక సమస్యను పరిష్కరించాలని కోరారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు శిక్షణ

ఏలూరు(మెట్రో): సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల నేపథ్యంలో గురువారం కలెక్టరేట్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డీఆర్వో వి.విశ్వేశ్వరరావు మాట్లాడుతూ సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జిల్లాలో 253 మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు, 11 మీడియం ఇరిగేషన్ ట్యాంకులు, 92 మేజర్ ఇరిగేషన్ ట్యాంకులకు సంబంధించి 356 సంఘాలు ఉన్నాయన్నారు.

ధాన్యం తోలకానికి టీడీపీ ఆటంకాలు



పోతునూరు రైతు సేవా కేంద్రం వద్ద నిరసన దీక్ష చేస్తున్న మిల్లు యజమాని, రైతులు

- రైతు భరోసా కేంద్రం వద్ద మిల్లు యజమాని నిరసన దీక్ష
- వైఎస్సార్‌సీపీ నేతను కావడంతో కక్ష సాధింపు అని ఆవేదన
- మీ కోసంలో ఫిర్యాదు చేసినా స్పందన కరువు

దెందులూరు : రైతులు ఇష్టపడుతున్నా ధాన్యాన్ని తోలనివ్వకుండా టీడీపీ నాయకులు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ మిల్లు యజమాని డీఎస్‌వీడీ ప్రసాద్ (బుజ్జి), రైతులు, వైఎస్సార్‌సీపీ నేతలు పోతునూరు రైతు సేవా కేంద్రం వద్ద గురువారం నిరాహార దీక్ష చేపట్టారు. వైఎస్సార్‌సీపీ నేతకు చెందిన రైస్‌మిల్లు కావడంతో టీడీపీ నేతలు అడ్డుకుంటున్నారని వారు విమర్శించారు. వివరాలిలా ఉన్నాయి.. పోతునూరులో శ్రీ లీలా కృష్ణా ట్రేడర్స్ రైసుమిల్లుకు 30 ఏళ్ల నుంచి రైతులు ధాన్యాన్ని తోలుతున్నారు. మిల్లు యజమాని రైతులకు పెట్టుబడి పెడుతున్నారు. ఈ ఏడాది కూడా రైతులంతా ఈ మిల్లుకు ధాన్యం తోలడానికి రైతు సేవా కేంద్రానికి వచ్చి సిబ్బందిని అడుగుతున్నా వారు కుదరదని చెబుతున్నారు. దీనిపై గురువారం మిల్లు యజమాని బుజ్జి రైతు సేవా కేంద్రానికి వెళ్లి సిబ్బందిని ప్రశ్నించారు. స్థానిక టీడీపీ నాయకులు ఆ మిల్లుకు ధాన్యం పంపవద్దని చెబుతున్నారని వారు సమాధానమిచ్చారు. దీంతో మిల్లు యజమాని, రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు అక్కడే నిరసన దీక్షకు దిగారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తతంగా మారగా ఎస్సై శివాజీ పోలీసు సిబ్బందితో అక్కడకు వచ్చారు. ముఖ్యమంత్రి రైతులకు నచ్చిన మిల్లుకు ధాన్యాన్ని తోలుకోవచ్చని ఆదేశాలు ఇచ్చారని, ఇక్కడ టీడీపీ నాయకులు మాత్రం తాను వైఎస్సార్‌సీపీ నేతను కావడంతో తన మిల్లుకు ధాన్యం రాకుండా అడ్డుకుంటున్నారని, విషయాన్ని కలెక్టర్, జేసీకి మీకోసంలో ఫిర్యాదు చేశానని మిల్లు యజమాని బుజ్జి అన్నారు. ఇదిలా ఉండగా ధాన్యం కొనుగోలులో పార్టీల ప్రస్తావనపై పోతునూరు సర్పంచ్ బోదుల స్వరూప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు ధాన్యం తోలకాన్ని అడ్డుకోవడం బాధాకరమన్నారు. సర్పంచ్ స్వరూప్, వైఎస్సార్‌సీపీ నాయకులు డీబీఆర్‌కే చౌదరి, వాసే డొమినిక్, బత్రాజు సత్యనారాయణ, బోయిన ఏసుబాబు, నాయకులు, రైతులు దీక్షకు మద్దతు తెలిపారు.

పార్టీ శ్రేణులకు అండగా జగన్

మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



తణుకులో పార్టీ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్ : వైఎస్సార్‌సీపీ శ్రేణులందరికీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకులో గురువారం నియోజకవర్గ ముఖ్య నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కారుమూరి మాట్లాడుతూ సోషల్ మీడియాను బూచిగా చూపించి పార్టీ శ్రేణులు, వైఎస్సార్, జగన్ అభిమానులను బెదిరించే ధోరణిని కూటమి ప్రభుత్వం అవలంబిస్తోందన్నారు. ఎన్ని కేసులు పెట్టినా ఎవరూ భయపడాల్సిన పనిలేదని, ఎక్కడ కేసులు పెట్టినా వారిని బయటకు తీసుకువచ్చేలా జగన్ కార్యాచరణ అమలు చేస్తున్నారని స్పష్టం చేశారు. కూటమి నేతలకు అనుకూలంగా పనిచేసే పోలీసు అధికారులపై వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ప్రైవేట్ కేసులు వేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. అత్తిలికి చెందిన సోషల్ మీడియా యాక్టివిస్ట్ బుడితి సుజన్‌కుమార్‌పై కేసు నమోదు చేసి భీమవరం పోలీస్‌స్టేషన్‌లో హాజరుకావాలని చెప్పారని, ఈ విషయాన్ని జగన్ దృష్టికి తీసుకువెళ్లానన్నారు. కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలుచేస్తోందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని భరోసా ఇచ్చారు.

అబద్ధాలతో గద్దెనెక్కిన కూటమి

అబద్ధాలు చెప్పి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వంపై ప్రజలు పూర్తి అసహనంతో ఉన్నారని కారుమూరి అన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీకి 40 శాతం పార్టీ ఓటింగ్ ఉందని స్పష్టం చేశారు. శ్రేణులంతా పార్టీ బలోపేతానికి పనిచేయాలని పిలుపునిచ్చారు. త్వరలో ప్రతి మండలంలో ఒక రోజు స్థానికంగా ఉంటూ పార్టీ శ్రేణులతో చర్చిస్తామని, ప్రతి వార్డులోనూ కమిటీలు వేస్తామని చెప్పారు. ప్రజల సమస్యలు, ధరల పెరుగుదల, సంక్షేమ పథకాల అమలు వంటి విషయాల్లో ప్రజలకు మద్దతుగా ఉంటూ నిరసనలు తెలపాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఎదుర్కొంటున్న సమస్యలను పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. పార్టీ సంస్థాగత పనులు, కార్యాచరణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కారుమూరి వారితో చర్చించారు.

డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, వైఎస్సార్‌సీపీ ప్రచార కమిటీ జిల్లా అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు, అత్తిలి ఏఎంసీ మాజీ చైర్మన్ బుద్ధరాతి భరణిప్రసాద్, తణుకు, ఇరగవరం మండల అధ్యక్షులు మంగెన సూర్య, కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, ముఖ్య నాయకులు మెహర్ అన్సారీ, నూకల కనకదుర్గ, ఉండ్రాజవరపు గీత, మారిశెట్టి శివ శంకర్, మారిశెట్టి శేషగిరి, వి.సీతారాం, ఆకుల పండుస్వామి, కరిబండి రాజేష్, నిమ్మకాయల సురేష్, అడ్డా బాబు తదితరులు పాల్గొన్నారు.

సంతృప్తికర సేవలందించాలి

భీమవరం(ప్రకాశం చౌక్) జిల్లాలో మీసేవా కేంద్రాలు ప్రజలకు సంతృప్తికర సేవలందించాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో మీసేవా కేంద్రాల నిర్వాహకులు, ఆపరేటర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. కేంద్రాలపై పలు ఫిర్యాదులు వచ్చాయని, గ్రామ రెవెన్యూ సదస్సుల ద్వారా ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సేవలకు అధిక వసూళ్లపై ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన చార్జీలను మాత్రమే వసూలు చేయాలన్నారు. శుక్రవారం నుంచి మీసేవా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తామని, లోపాలు గుర్తిస్తే రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామని హెచ్చరించారు. డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు, ఈడీఎం ఎం.కిరణ్‌కుమార్, టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలకు బాల్యం నుంచే బాటలు

- విద్యార్థులకు డీఈఓ నారాయణ సూచన
- 'సాక్షి' ఆధ్వర్యంలో బాలల దినోత్సవం
- చిల్డ్రన్ హోంలో వేడుకలు





ఇమ్మానియేల్ చిల్డ్రన్ హోంలో విజేతలకు బహుమతులు అందిస్తున్న డీఈఓ నారాయణ

సాక్షి, భీమవరం : పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం, దాతలు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని జిల్లా విద్యాశాఖాధికారి ఈ.నారాయణ అన్నారు. భీమవరం రూరల్ చినఅమిరం లోని ఇమ్మానియేల్ చిల్డ్రన్ హోంలో 'సాక్షి', విజ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యంలో గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఈఓ నారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, ఉన్నత శిఖరాలు చేరుకునేందుకు బాల్యం నుంచే బాటలు వేసుకోవాలన్నారు. ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణ, ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. తల్లిదండ్రులను కోల్పోయిన, ఆదరణకు నోచుకోని చిన్నారులను చేరదీసి వారి ఉన్నతికి చిల్డ్రన్ హోం నిర్వాహకుడు ఇమ్మానియేల్ చేస్తున్న కృషిని ప్రశంసించారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని వేడుకల నిర్వహణపై 'సాక్షి'ని డీఈఓ నారాయణ ప్రత్యేకంగా అభినందించారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు

- చిల్డ్రన్ హోంలో ఏర్పాటుచేసిన చెస్, కేరమ్స్, స్కిప్పింగ్, మ్యూజిక్ చైర్ ఆటల పోటీల్లో 50 మంది చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.
- మ్యూజికల్ చైర్‌లో.. కుసుమరాణి (4వ తరగతి), కృపారాణి (5వ తరగతి), ఝాన్సీ (3వ తరగతి)
- కేరమ్ బోర్డులో.. చరణ్ (9వ తరగతి), పార్థు (7వ తరగతి), బాషా (7వ తరగతి)
- చెస్‌లో.. లక్ష్మణ్ (7వ తరగతి), గౌతమ్ (6వ తరగతి), చరణ్‌కుమార్ (6వ తరగతి)
- స్కిప్పింగ్‌లో.. మీనాక్షి (6వ తరగతి), ప్రశాంతి (6వ తరగతి), తేజశ్రీ (6వ తరగతి) విజేతలుగా నిలిచారు.

డీఈఓ చేతులమీదుగా బహుమతులు

విజ్ఞాన వేదిక సభ్యుడు వేమిరెడ్డి పవన్ సౌజన్యంతో ఆయా పోటీల్లో విజేతలకు డీఈఓ నారాయణ బహుమతులు, విద్యార్థులకు స్వీట్లు, పండ్లు అందజేశారు. విజ్ఞాన వేదిక అధ్యక్షుడు అల్లు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ ఏడీ ఎస్.సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ కుమారస్వామి, విజ్ఞాన వేదిక సభ్యులు వేమిరెడ్డి పవన్, అరసవల్లి మణికంఠ వెంకటేష్, ఇందుకూరి శివాజీ వర్మ, వాల్మీకి బాలాజీ, చిల్డ్రన్ హోం నిర్వాహకుడు ఇమ్మానియేల్ తదితరులు పాల్గొన్నారు.



కేరమ్స్ పోటీల్లో చిల్డ్రన్ హోం చిన్నారులు



మ్యూజికల్ చైర్ పోటీల్లో ..



చెస్ పోటీల్లో విద్యార్థులు

సోషల్ మీడియాకు అండగా ప్రత్యేక బృందం



కారుమూరి సునీల్‌కుమార్



మామిళ్లపల్లి జయప్రకాష్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సోషల్ మీడియా కార్యకర్తలకు అండగా నిలిచేందుకు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్టు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. పశ్చిమగోదావరి జిల్లాకు కారుమూరి సునీల్‌కుమార్‌యాదవ్, మామిళ్లపల్లి జయప్రకాష్‌లను బృందంగా ఏర్పాటు చేసినట్టు పేర్కొంది. ఈ బృందం ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న సోషల్ మీడియా కార్యకర్తల అక్రమ నిర్బంధాలు, అరెస్టులపై న్యాయ సహాయం అందించడంతో పాటు వారికి భరోసా ఇస్తారని తెలిపింది. అలాగే సోషల్ మీడియా కార్యకర్తల్లో ఆత్మస్థైర్యం పెంచడం కోసం పార్టీ నేతలు, సంబంధిత నాయకులు, లీగల్ సెల్ ప్రతినిధులను ఈ బృందం సమన్వయం చేసుకుంటుందని పేర్కొంది.

అంతర్రాష్ట్ర నేరస్తుడి అరెస్ట్

- కామవరపుకోట మండలానికి చెందిన చీకట్ల సతీష్‌గా గుర్తింపు
- అతడిపై తెలుగు రాష్ట్రాల్లో 80కి పైగా కేసులు
- వివరాలు వెల్లడించిన ఏలూరు జిల్లా ఎస్పీ కేపీ శివకిషోర్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శివకిషోర్, చిత్రంలో ఏఎస్పీ సూర్యచంద్రరావు



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు, వెండి, నగదు

ఏలూరు టౌన్: జంగారెడ్డిగూడెంలో గురువారం జరిపిన వాహన తనిఖీల్లో అంతర్రాష్ట్ర నేరస్తుడు పట్టుబడ్డాడు. అతడిపై తెలుగు రాష్ట్రాల్లో సుమారు 80కిపైగా చోరీ కేసులు నమోదు కావడం గమనార్హం. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ గురువారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. కామవరపుకోట మండలం పాత కొండగూడెం గ్రామానికి చెందిన చీకట్ల సతీష్ అలియాస్ పండు టెన్త్ వరకూ చదివాడు. తడికలపూడి పోలీస్‌స్టేషన్‌లో డీసీ షీట్ కలిగిన బావ మానుకొండ అనిల్‌తో కలిసి నేరాలను ప్రారంభించాడు. 2009లో ఉమ్మడి ఏపీ అశ్వారావుపేట, నల్లజర్ల మండలాల్లో రాత్రివేళల్లో ఇంట్లో చోరీలు చేస్తూ మొదటిసారి అశ్వారావుపేట పోలీసులకు పట్టుబడ్డాడు. వారు సతీష్‌ను అరెస్ట్ చేసి జువైనల్ హోమ్‌కు తరలించారు. బయటకు వచ్చిన తరువాత కూడా నేరప్రవృత్తి కొనసాగించాడు. ఏలూరు త్రీటౌన్, ఏలేశ్వరం, తడికలపూడి, చాగల్లు, ద్వారకాతిరుమల, లక్కవరం, సమిశ్రగూడెం, నరసాపురం, కాకినాడ, పాల్వంచ, జంగారెడ్డిగూడెం, హైదరాబాద్, రాజమహేంద్రవరం, పెదపాడు, దెందులూరు, కై కలూరు, సింగరాయకొండ, తాడేపల్లిగూడెం, దేవరపల్లి, గన్నవరం, ఆగిరిపల్లి ఇలా అనేక ప్రాంతాల్లో ఇళ్లల్లో చోరీలకు పాల్పడ్డాడు. అతడిపై ఏకంగా 80కిపైగా చోరీ కేసులు నమోదు కాగా వాటిలో 35 కేసుల్లో శిక్షలు కూడా అనుభవించాడు.

పీడీ యాక్ట్ కేసులు సైతం

చీకట్ల సతీష్ 2013లో బుట్టాయగూడెం పోలీస్‌స్టేషన్ పరిధిలో కామవరం గ్రామంలో ఒక వ్యక్తిని హత్య చేసి కారును చోరీ చేశాడు. ఈ కేసుల్లో అరెస్టయి జైలుకు వెళ్లాడు. ఇతడి నేరాలు శ్రుతిమించడంతో 2020లో పాల్వంచలో పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపగా 9 నెలలు అనంతరం రిలీజ్ అయ్యాడు. 2022లో తడికలపూడి పోలీసులు సైతం పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపగా 11 నెలలు జైలులో ఉన్నాడు. ఈ ఏడాది జూలైలో గంజాయి అక్రమంగా రవాణా చేస్తూ తడికలపూడి పోలీసులకు చిక్కటంతో జైలుకు వెళ్లాడు.

ఇద్దరు మహిళలపై దాడి.. రాబరీ

2024 జూలైలో గంజాయి కేసులో అరెస్ట్ అయిన చీకట్ల సతీష్‌కు జైలులో జంగారెడ్డిగూడెం వాసి వెల్డింగ్ పనులు చేసుకునే అబ్దుల్లాతో పరిచయం ఏర్పడింది. అతనితో కలిసి జంగారెడ్డిగూడెం రాజులకాలనీలో అపార్ట్‌మెంట్ వద్ద పల్సర్ మోటారు సైకిల్‌ను చోరీ చేశాడు. ఈ క్రమంలోనే అబ్దుల్లా, నక్కా కిషోర్ అనే ఇద్దరు ముందుగా వేసుకున్న పథకంలో భాగంగా తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం సాగిపాడులోని ఒక ఇంట్లో ఈనెల 2న రాత్రి సతీష్, అబ్దుల్లా భారీ చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో ఉన్న ఇద్దరు మహిళలను ఇనుప రాడ్లతో తలపై కొట్టి, చేతులు, కాళ్లను కట్టేసి బంగారు ఆభరణాలు, వెండి, రూ.3 లక్షల నగదును దోచుకువెళ్లారు.

కేసును ఛేదించిన పోలీసులు

అత్యంత పాశవికంగా మహిళలను రాడ్లతో కొట్టి రాబరీ చేసిన దొంగలను పట్టుకునేందుకు పోలీస్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ఆదేశాలతో జంగారెడ్డిగూడెం డీఎస్పీ యూ రవిచంద్ర ఆధ్వర్యంలో రంగంలోకి దిగిన ఏలూరు జిల్లా ఎస్‌బీ సీఐ బీ.ఆదిప్రసాద్, గణపవరం సీఐ ఎంవీ సుభాష్, జంగారెడ్డిగూడెం సీఐ కృష్ణబాబు ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం ఎస్సై ఎస్‌కే జబీర్, ఏఎస్సై ఎస్‌వీ సంపత్‌కుమార్, కానిస్టేబుళ్లు ఎస్‌కే షాజహాన్, ఏలూరు సీసీఎస్ సిబ్బంది నాగరాజు, రజనీకుమార్ బృందాలుగా ఏర్పడి నేరస్తులను పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా గురువారం జంగారెడ్డిగూడెంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా చీకట్ల సతీష్ పట్టుబడ్డాడు. అతడి నుంచి మోటారు సైకిల్, చోరీ సొత్తు 47.1/2 కాసుల బంగారు అభరణాలు, 4 కిలోల వెండి వస్తువులు, రూ.2,46,150 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో అత్యంత ప్రతిభ చూపిన పోలీస్ అధికారులకు ఎస్పీ శివకిషోర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, నగదు పురస్కారాలను అందజేశారు. విలేకరుల సమావేశంలో ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు ఉన్నారు.

జోన్–2 బాలికల గురుకుల పోటీలు ప్రారంభం





క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రాష్ట్ర అదనపు కార్యదర్శి సునీల్‌రాజ్‌కుమార్, కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

భీమడోలు: జోన్–2 బాలికల గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ క్రీడలు గురువారం పోలసానిపల్లి బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల కళాశాలలో ఆట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి, కృష్ణా, తూర్పు గోదావరి జిల్లాల నుంచి 29 కళాశాలలకు చెందిన 1050 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొననున్నారు. తొలుత పోటీలను అడిషనల్ కార్యదర్శి సునీల్‌రాజ్ కుమార్ ప్రారంభించారు. క్రీడాకారులు క్రీడా జ్యోతితో ప్రాంగణంలో ప్రదర్శన నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ప్రిన్సిపాల్ వీవీ రమణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా సునీల్ రాజ్‌కుమార్‌తోపాటు డీసీవో ఎస్.భారతి, జోనల్ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ శ్యామల, ఎంఈవోలు ఈదుపల్లి శ్రీనివాసరావు, అయినపర్తి భాస్కర్‌కుమార్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని చాటి క్రీడాంధ్రప్రదేశ్ లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలని ఆకాక్షించారు. తొలుత దేశ తొలి ప్రధాని నెహ్రూ, బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాలుగురోజులపాటు జరగనున్న ఈ పోటీల్లో తొలిరోజు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ కార్యక్రమాల్లో కళాశాల పీడీ సాయిలక్ష్మీ, వట్లూరు, జంగారెడ్డిగూడెం, ఆచంట, ద్వారకాతిరుమల, నూజివీడు, తుని గురుకుల పాఠశాల ప్రిన్సిపాళ్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

మట్టిలో మాణిక్యాలు

- ఇంటర్నేషనల్ కరాటే పోటీలకు చిల్డ్రన్ హోం విద్యార్థినులు
- 26న మలేషియాకు పయనం



ఇంటర్నేషనల్ కరాటే పోటీలకు అర్హత సాధించిన భీమవరంలోని చిల్డ్రన్ హోం విద్యార్థినులు

సాక్షి, భీమవరం: ప్రతిభకు పేదరికం అడ్డుకాదని నిరూపిస్తున్నారు భీమవరంలోని ఇమ్మానియేల్ చిల్డ్రన్ హోంకు చెందిన విద్యార్థినులు. దేశీయ పోటీల్లో సత్తా చాటడం ద్వారా 9వ ఇంటర్నేషనల్ (క్లబ్) ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ కేఎల్ మేయర్స్ కప్ పోటీలకు అర్హత సాధించారు. ఈనెల 27 నుంచి డిసెంబరు 2వ తేదీ వరకు మలేషియాలో జరిగే పోటీల్లో వీరు పాల్గొంటారు. బి.జెస్సీ (9వ తరగతి) చిల్డ్రన్ హోం నిర్వాహకుడు ఇమ్మానియేల్ కుమార్తె కాగా, మిగిలిన ఇద్దరూ నిరాదరణకు గురై చిన్ననాటి నుంచి చిల్డ్రన్‌హోంలో ఆశ్రయం పొందుతున్నవారే. డి. ప్రియ పదవ తరగతి, ఎన్ అశ్విని 9వ తరగతి చదువుతున్నారు. కరాటే పట్ల వీరికున్న ఆసక్తిని గమనించిన ఇమ్మానియేల్ దాతల సహకారంతో గత ఐదేళ్లుగా పట్టణంలోని జపాన్ హయాషీ–హాషిటో ర్యూ కై ఇండియా కోచింగ్ సెంటర్‌లో చేర్పించి శిక్షణ ఇప్పిస్తున్నారు. గతంలో ముగ్గురు విద్యార్థినులు జిల్లా, రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో పాల్గొని పలు బెల్టులు, మెడల్స్ గెలుపొందారు. ఇప్పటి వరకు జెస్సీ తొమ్మిది బెల్టులు, 19 మెడల్స్ సాధించగా, ప్రియ రెండు బెల్టులు, ఐదు మెడల్స్, అశ్విని రెండు బెల్టులు, రెండు మెడల్స్ సాధించారు. ఈనెల 27 నుంచి డిసెంబరు 2వ తేదీ వరకు కౌలాలంపూర్‌లోని తితీవాంగ్సా ఇండోర్ స్టేడియంలో జరిగే ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో వీరు పాల్గొంటారని ఇమ్మానియేల్ తెలిపారు. టీం మేనేజర్‌గా విజయభాస్కర్ నేతృత్వంలో 26వ తేదీన మలేషియాకు బయలుదేరి వెళతారన్నారు. వీరి ప్రయాణ ఖర్చులు కోసం దాతల సహకారం కోరుతున్నామన్నారు.

టెలీ కాలర్స్ ఉద్యోగాలంటూ మోసం

కొయ్యలగూడెం: టెలీ కాలర్స్ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ తమను ఓ సంస్థ నమ్మించి మోసం చేసిందని కొయ్యలగూడెంకి చెందిన యువకులు ఆరోపిస్తున్నారు. గురువారం బాధితులు అడపా సత్యనారాయణ, కడప మోహనరావు, ఎస్‌కే మొహిద్దీన్, నులకాని వెంకట్రావు తాము మోసపోయిన తీరును విలేకరుల సమావేశంలో వివరించారు. కొద్ది నెలల క్రితం టెలీకాలర్స్ ఉద్యోగాల ద్వారా తమకు ఉపాధి కల్పిస్తామంటూ టీవీసీఎస్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో 76720 43835, 79816 62273, 73309 89518 నంబర్ల నుంచి ఫోన్లు వచ్చాయన్నారు. పార్ట్ టైం ఉద్యోగాలతో నెలకు పదివేల వరకు పైగా సంపాదించుకోవచ్చునని చెప్పినట్లు తెలిపారు. అయితే ముందుగా రూ.10 వేలు కట్టమని చెప్పారని, దీంతో వారు పేర్కొన్న అడ్రస్‌కి నగదు జమ చేయడం జరిగిందన్నారు. సొమ్ములు కట్టిన తరువాత తమకు ముందుగా పేర్కొన్న షరతులతో కూడిన బాధ్యతలను అప్పగించకుండా కంపెనీ వాళ్లు పేర్కొన్న ప్రాడక్టులు అమ్మాలంటూ షరతులు విధించారన్నారు. దీనికి విముఖత వ్యక్తం చేసి తమ సొమ్ములు తిరిగి ఇవ్వమని కోరగా నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారని వాపోయారు. దీనిపై పలుమార్లు కంపెనీ సభ్యులకు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో మోసపోయినట్లు గ్రహించామన్నారు. తామంతా దినసరి కూలీలుగా, సంస్థల్లో కార్మికులుగా పనిచేస్తున్న వారమేనని తమతో సహా ఈ ప్రాంతంలో చాలామందితో సంస్థ సొమ్ములు కట్టించుకుని ఆపై మొహం చాటేసారంటూ ఆరోపించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

అద్దె వాహనాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు జిల్లాలోని రవాణా శాఖలో ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు ఉపయోగించడానికి నెలవారీ అద్దె ప్రాతిపదికన వాహనాలు ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏలూరు జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీమ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని కార్యాలయాల్లో వినియోగించడానికి ఒక ఇన్నోవా, 3 లేటెస్ట్ మోడల్ మారుతి డిజైర్ లేదా బ్రిజా కారు వాహనాలు అవసరమన్నారు. ఆసక్తి కలిగిన వారు కంపెనీ ట్రావెల్స్ తరుపున ఉపరవాణా కమిషనరు కార్యాలయం, ఏలూరులో ఈ నెల 21వ తేదీలోగా దరఖాస్తులు అందజేయాలన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఆపాలి

- వామపక్షాల డిమాండ్
- 22న ఏలూరులో జరిగే సదస్సును జయప్రదం చేయాలని పిలుపు



వామపక్షాల రౌండ్ టేబుల్ సమావేశంలో ఐక్యతను చాటుతున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఆపాలని, విద్యుత్ చార్జీల భారాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22న ఏలూరులో జరిగే సదస్సును జయప్రదం చేయాలని వామపక్ష పార్టీలు గురువారం పిలుపునిచ్చాయి. స్థానిక పవరుపేటలో గల సీపీఎం ఏలూరు జిల్లా కార్యాలయంలో వామపక్ష పార్టీల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ రైతులు, ప్రజల పాలిట ఉరితాళ్లుగా మారనున్న విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని, ఎఫ్‌సీసీపీఏ చార్జీల పేరిట ప్రజలపై రూ.6,072 కోట్ల భారాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ప్రభుత్వ కార్యాలయాలకు ముందుగా ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని, ప్రస్తుతం చిన్న, మధ్యతరగతి వ్యాపార సంస్థలతో సహా అందరికీ స్మార్ట్ మీటర్లు పెడుతున్నారని తెలిపారు. సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పంపుసెట్లకు మీటర్లు బిగించడాన్ని ప్రతిపక్షంలో ఉండగా టీడీపీ, జనసేన పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయని, ఆ మీటర్లు పగలగొట్టాలని ఆ నేతలు పిలుపు కూడా ఇచ్చారని గుర్తుచేశారు. ఇప్పుడు వారే ట్రూ అప్ చార్జీల భారం వేస్తున్నారని, మరోవైపు స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని, ఎన్నికల హామీలను విస్మరించి ప్రజలను వంచించటం తగదని తెలిపారు. ఎంసీపీఐ (యు) జిల్లా కార్యదర్శి ఎస్. నాగరాజు మాట్లాడుతూ ప్రతి మీటర్‌కు అయ్యే వ్యయం 96 నెలల పాటు వాయిదాల పద్ధతిలో వేలాది రూపాయలు వినియోగదారుల నుంచే వసూలు చేస్తారన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచన చేయాలని, స్మార్ట్ మీటర్లు ఆపాలని, ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సీపీఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తలారి ప్రకాష్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లపై ఎక్కడికక్కడ ప్రజలు సమైక్యమై ప్రతిఘటించాలని, ప్రజాప్రతినిధులను నిలదీయాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు తాను ఎన్నికల్లో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను చిత్తశుద్ధితో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్. లింగరాజు, పి.కిషోర్, సీపీఐ టౌన్ కార్యదర్శి యు.హేమశంకర్, ఎఐకేఎంఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు సముద్రాల సుందరం పాల్గొన్నారు.

క్లుప్తంగా

చెస్ విజేత 'సీఆర్ఆర్'



ఎంపికైన విశ్వవిద్యాలయం టీమ్‌లు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ (కాకినాడ) సెంట్రల్ జోన్ చెస్ (మెన్ అండ్ ఉమెన్) అంతర్ కళాశాలల చెస్ టోర్నమెంట్‌లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన క్రీడాకారులు సత్తా చాటారు. మెన్స్ విభాగంలో సర్ సీఆర్ రెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రథమ స్థానం సాధించి విజేతగా నిలవగా ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కాలేజీ తృతీయ స్థానంలో నిలిచింది. అలాగే ఉమెన్స్ విభాగంలో సైతం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కాలేజీ ద్వితీయ స్థానం సాధించింది. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ క్రీడా విభాగం ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. అనంతరం విశ్వవిద్యాలయం టీమ్‌లను ఎంపిక చేశారు. ఇందులో మెన్స్ విభాగంలో వై.రమశ్రీకర్ (సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కాలేజ్), బీజేఎస్‌కే రణధీర్ (ఎన్ఆర్ఐటి, ఆగిరిపల్లి), ఉమెన్స్ విభాగంలో జి.విజయలక్ష్మి (ఎస్ఆర్‌కేఆర్, భీమవరం), స్టాండ్‌బైలో ఎ.ఝాన్సీ (ఎస్ఆర్‌కేఆర్ భీమవరం) ఎంపికయ్యారు. ఎంపికైన బృందాలు డిసెంబర్ నాలుగు నుంచి ఏడు వరకు చెన్నై వెల్‌టెక్ యూనివర్సిటీలో జరిగే సౌత్‌జోన్ చెస్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

రేపు బాక్సింగ్, థాంగ్ టా మార్షల్ ఆర్ట్ ఎంపికలు

వీరవాసరం: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అండర్ 14, 17 బాల, బాలికల బాక్సింగ్, థాంగ్ టా మార్షల్ ఆర్ట్ జట్ల ఎంపిక ఈనెల 16వ తేదీన అత్తిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలనందు నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి పీఎస్ఎన్ మల్లేశ్వరరావు పత్రికా ప్రకటనలో తెలియజేశారు. ఈ ఎంపికల్లో పాల్గొనే విద్యార్థులు స్టడీ సర్టిఫికెట్, డేట్ అఫ్ బర్త్ సర్టిఫికెట్‌తో ఉదయం 9 గంటలకు రిపోర్ట్ చేయాలన్నారు. వివరాలకు 70137 81688 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

17న బాస్కెట్‌బాల్ మహిళల జిల్లా జట్ల ఎంపిక

ఏలూరు రూరల్: డిసెంబర్ 6వ తేదీ నుంచి 9 వరకూ పశ్చిమగోదావరి జిల్లా మార్టేరులో రాష్ట్రస్థాయి మహిళల బాస్కెట్‌బాల్ పోటీలు జరుగుతాయని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కె కృష్ణారెడ్డి, కార్యదర్శి గవ్వ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా సీనియర్ మహిళల జట్టును ఈ నెల 17వ తేదీన ఎంపిక చేస్తామని కోశాధికారి కె మురళీకృష్ణ వెల్లడించారు. ఏలూరు కస్తూర్బా బాలికల పాఠశాలలో ఉదయం 9.30 గంటలకు ఎంపిక పోటీలు ప్రారంభమౌతాయని వివరించారు. ఆసక్తి గలవారు 94411 71933 లేదా 94403 49534 నంబర్లలో సంప్రదించాలన్నారు.

చేపల వేటకు వెళ్లి..

పోలవరం రూరల్: చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తూ పోలవరం కుడికాలువలో మునిగి ఒక వ్యక్తి మృతిచెందాడు. పోలవరం మండలం వెంకటరెడ్డిగూడెం గ్రామానికి చెందిన తాతి దొరబాబు (40) కుడికాలువలో చేపల వేటకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు మునిగిపోవడంతో మృతిచెందాడని, మృతదేహం బ్రిడ్జి సమీపంలో లభించినట్లు ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

ఏపీఎస్‌టీఏ జిల్లా కార్యవర్గ నియామకం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇటీవల నూతనంగా ప్రారంభించిన ఆంధ్రప్రదేశ్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీఎస్‌టీఏ) ఏలూరు జిల్లాకు కార్యవర్గాన్ని నియమించినట్లు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జీజేఏ స్టీవెన్ తెలిపారు. ఈమేరకు గురువారం స్థానిక సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూతన కార్యవర్గాన్ని నియమించారు. ఏలూరు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా కాటి వెంకటరమణ, తోట ప్రసాద్, గౌరవ అధ్యక్షుడిగా ఉర్ల గంధర్వరావును నియమితులయ్యారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తామని నూతన కార్యవర్గం తెలిపింది. సీనియర్ ఉపాధ్యాయులు ఎం.ప్రకాష్ రాజ్, దిడ్ల వరప్రసాద్, కే.జేమ్స్ నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

క్లుప్తంగా

బాలలు అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం :బాలలు అన్ని రంగాల్లో రాణించాలని గురువారం పలు విద్యాసంస్థల్లో జరిగిన బాలల దినోత్సవ కార్యక్రమాల్లో వక్తలు పేర్కొన్నారు. శశి ఇంజనీరింగ్ కళాశాల రెడ్‌యాంట్స్ , జాతీయ సేవా పథకం విద్యార్థులు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు క్రీడా పోటీలు, చిత్రలేఖనం, క్విజ్ నిర్వహించారు. నన్నయ్య ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో అతిథిగా శశి కళాశాల వైస్‌చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ ప్రిన్సిపాల్ టి.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బీవీఆర్ కళా సేవలు అభినందనీయం



బాలికలచే నృత్యప్రదర్శనలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): బీవీఆర్ కళా సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. పట్టణంలో గురువారం కళా కేంద్రం ఆధ్వర్యంలో నెలవారీ సంగీత, నృత్య, సాహితీ, సాంస్కృతిక సమాహారం ఘనంగా నిర్వహించారు. బీవీఆర్ కళా కేంద్రం వ్యవస్థాపకులు బుద్దాల వెంకట రామారావు పర్యవేక్షించారు. విద్యార్థులతో నృత్య ప్రదర్శనలు జరిగాయి. ఉత్తమ ఉద్యోగ సేవా పురస్కారం ఎన్‌సీసీ అధికారి కేవీ గణపతిరావుకు, పీఈటీ కొత్త సుభద్రకు అందజేశారు. బీద కళాకారులకు ఆర్థిక సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో సిరిమామిళ్ళ పెద్దిరాజు, ఎన్వీ రమణారావు, పట్టణ ప్రముఖులు, కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై భారం మోపొద్దు



ఇరగవరంలో రెవెన్యూ సిబ్బందికి వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఇరగవరం: ధరలను స్థిరీకరించాలని ఇరగవరం మండలం సీపీఎం కన్వీనర్ కామన మునిస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఇరగవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ ట్రూఅప్ చార్జీలను ప్రభుత్వమే భరించాలన్నారు. సీపీఎం నాయకులు ఇల్లిందలపర్తి సత్యనారాయణ, గుత్తుల రామాంజనేయులు, పాల సత్యనారాయణ, పిల్లి ఏడుకొండలు, గుబ్బల ముత్యాలరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కుంచనపల్లి, మోదుగ గుంట, వీరంపాలెం సబ్ స్టేషన్ల పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు విద్యుత్ ఈఈ కే.నరసింహమూర్తి తెలిపారు. దీంతో కుంచనపల్లి, మెట్ట ఉప్పరగూడెం, ఇటుకులగుంట, అమృతపురం, మోదుగ గుంట, గొల్ల గూడెం, అప్పారావుపేట, వెంకట్రావుపాలెం, వీరంపాలెం, బంగారుగూడెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

తణుకు: తణుకు, ఇరగవరం, తేతలి విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో లైన్లు మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తాడేపల్లిగూడెం డీఈ కె.నరసింహమూర్తి తెలిపారు. తణుకు పట్టణంలోని రామకృష్ణమఠం, సజ్జాపురం, యాపిల్ ఆస్పత్రి ప్రాంతాలతోపాటు తణుకు మండలం పైడిపర్రు, మండపాక, వీరభద్రపురం, ఇరగవరం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

సంక్షేమం ఊసేలేని కూటమి ప్రభుత్వం

- సూపర్ సిక్స్ కోసం ఎదురుచూస్తున్న ప్రజానీకం
- జగన్ ప్రభుత్వంలో తణుకు నియోజకవర్గానికి రూ. 3300 కోట్లు
- ప్రతి నెలా సంక్షేమ పండగే
- చిరువ్యాపారాలతో ఆర్థికంగా నిలబడ్డ మహిళాలోకం



తణుకులో వైఎస్సార్ చేయూత కార్యక్రమానికి హాజరైన మహిళలు (ఫైల్)

తణుకు అర్బన్: గత ఐదేళ్లు సంక్షేమ జాతరతో ఇంటింటా పండుగ చేసుకున్న ప్రజానీకానికి కూటమి ప్రభుత్వం షాకిస్తోంది. ప్రభుత్వం ఏర్పడి 5 నెలలు కావస్తున్నా ఇంతవరకు ఇచ్చిన హామీ ప్రకారం సూపర్ సిక్స్ అమలు చేయకపోవడంతో ప్రజలకు చిర్రెత్తుకొస్తోంది. కుళాయిల వద్ద, టీ కొట్లు, కిరాణా దుకాణాల దగ్గర కూటమి ప్రభుత్వతీరుపై మహిళలు దుమ్మెత్తిపోస్తున్నారు. జగనే ఉంటే ఈపాటికి నెలకో సంక్షేమం చొప్పున తమ బ్యాంకు ఖాతాల్లో జమచేసేవారని కానీ నేడు ప్రభుత్వం ఏర్పడి అర్థ సంవత్సరానికి దగ్గర పడుతున్నా ఇంతవరకు ఇచ్చిన 6 హామీలే అమలు చేయకపోగా బడ్జెట్‌లో సైతం పూర్తిస్థాయిలో నిధులు కేటాయింపులు జరపలేదని ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కేవలం పెంచిన పింఛను మాత్రమే ఇచ్చారని ఏడాదికి మూడు సిలిండర్లు ఉచిత పథకం కూడా అరకొరగానే జరుగుతుందనే విమర్శలు అధికంగానే వినిపిస్తున్నాయి. పెట్టే వారిని దూరం చేసుకున్నామని కొట్టే వారిని అందలమెక్కించారంటూ ప్రజానీకం బాహాటంగానే విమర్శించే దుస్థితి నెలకొంది.

జగన్ హయాంలో సంక్షేమం, అభివృద్ధికి రూ. 3300 కోట్లు..

గత జగన్ ప్రభుత్వంలో 2019 నుంచి 2024 వరకు వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధికి సంబంధించి తణుకు నియోజకవర్గంలో రూ. 3300 కోట్లు ఖర్చుచేశారు. తణుకు మునిసిపాలిటీ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాలకు సంబంధించి అర్హులైన పేదలందరికీ సంక్షేమం, రహదారులు, తాగునీరు, పాఠశాలల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయింపులు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ప్రజలు చెబుతున్నారు. ముఖ్యంగా జగనన్న అమ్మ ఒడి, డ్వాక్రా వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్సార్ పెన్షన్ కానుక, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ భీమా, వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ రైతు భరోసా, పంట రుణాలు, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, వాహనమిత్ర, వైఎస్సార్ కాపు నేస్తం, జగనన్న చేదోడు వంటి పథకాలతో జగన్ ప్రభుత్వం పేదవర్గాలకు అండగా నిలిచింది. దీంతో కోవిడ్ సమయంలో సైతం ఆర్థికంగా ఇబ్బందులు ఎదురైనా సంక్షేమ పథకాల లబ్ధితో ప్రజల చేతిలో డబ్బులు ఉండడంతో ఎటువంటి ఇబ్బందులు రాకపోగా మార్కెట్‌లో కొనుగోలు శక్తి పెరిగిందని వ్యాపారవర్గాలే ఢంకా మోగించి చెబుతున్నాయి. కూటమి నేతల మాయమాటలు నమ్మి మోసపోయామంటూ ప్రజానీకం గగ్గోలు పెడుతున్నారు.

ప్రభుత్వం ఉందా అనే ప్రశ్నతో ప్రజలున్నారు



ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం ఉందా అని ప్రజలు తమను తాము ప్రశ్నించుకుంటున్నారు. కూటమినేతల మాయమాటలు, అబద్దాలు నమ్మి మోసపోయామని ప్రజలు పశ్చాత్తాపపడుతున్నారు. జగన్ ఉన్నప్పుడు ప్రతినెలా పండుగేనని కానీ నేడు జగన్ ఇచ్చిన సంక్షేమ పథకాలు నిలుపుదలచేసి, ఇస్తామన్న సూపర్ సిక్స్‌ను తుంగలో తొక్కారని ప్రజలు తిడుతున్నారు. ఎన్నికల ముందు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుచూపు, అవగాహనతో అమలుచేయగలిగే హామీలనే ఇచ్చారని, కూటమి నేతలు మాత్రం అమలుచేయలేమని తెలిసికూడా ప్రజలను మోసం చేయడానికి కంకణం కట్టుకుని గద్దెనెక్కారు. జగన్ ఉంటే బావుండేదనే మాట మెజారిటీ ప్రజల్లో ఇప్పుడు కనిపిస్తోంది. తణుకు నియోజకవర్గంలో అర్హులందరికీ సంక్షేమం అందచేసి, అభివృద్ధికి పెద్దపీట వేయడంతో జగన్ హయాంలో రూ. 3300కోట్లు ప్రజలకు ఖర్చుచేయగలిగినందుకు గర్వపడుతున్నాను.

– కారుమూరి వెంకట నాగేశ్వరరావు, మాజీ మంత్రి

అర్హులైతే చాలు లబ్ధి అందేది



జగన్ ప్రభుత్వ హయాంలో అర్హులైతే చాలు పారదర్శకంగా సంక్షేమ లబ్ధి ఇంటి గుమ్మంలోకి వచ్చేది. కానీ నేడు పింఛను తప్ప మరొక్క సంక్షేమ పథకం అమలు కావడంలేదని ప్రజలు వాపోతున్నారు. ఇస్తానన్న సూపర్ సిక్స్ అమలు చేసి ప్రజలను ఆదుకోవాలి.

– మెహర్ అన్సారీ, వైఎస్సార్‌సీపీ తణుకు నియోజకవర్గ మహిళాధ్యక్షురాలు

పేదవర్గాలు అల్లాడుతున్నారు...



సంక్షేమం లేక పేదవర్గాలు అల్లాడిపోతున్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో రుచి చూసిన సంక్షేమ పథకాలు నేడు నిలిచిపోయాయని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మాకు ఎటువంటి లబ్ధి చేకూరడంలేదని ప్రజలు బాహాటంగానే చెబుతున్నారు.

– ఝాన్సీ లారెన్స్, తణుకు

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



వార్డులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రజలందరూ ఆరోగ్య నియమాలు పాటిస్తూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులను నియంత్రించవచ్చని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వీ. లక్ష్మణరావు పేర్కొన్నారు. పట్టణంలో ఆరోగ్య కేంద్రం వీకర్స్‌కాలనీ పరిధిలో 2, 3, 4 వార్డులలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు అమలు, వెక్టర్ కంట్రోల్ హైజీన్ కార్యక్రమాల పరిశీలన చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలకు పలు క్షేత్రస్థాయి పరిశీలనలు, అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు జ్యోతి, కెంపురత్నం, సరళ అంగన్‌వాడీ సిబ్బంది, ఆశాలు స్వాతి, దుర్గ లక్ష్మి, ఆరోగ్య సహాయకులు కాంతారావు పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పడాల అయ్యప్ప స్వామి పీఠంలో గురువారం అయ్యప్ప దీక్షాధారులకు అన్నప్రసాద వితరణ చేశారు. స్వర్గీయ కొవ్వూరి గాంధీరెడ్డి, హేమాద్రి నరసారెడ్డి జ్ఞాపకార్థం కొవ్వూరి అమ్మాజీ, కుటుంబీకులు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అమ్మాజీ మాట్లాడుతూ తన భర్త ఆశయాన్ని కొనసాగించేలా దీక్షాధారులకు అన్నప్రసాద వితరణ చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి కోలాట నృత్యప్రదర్శనను తిలకించారు. ఈ కార్యక్రమంలో కర్రి వెంకటరామకృష్ణారెడ్డి, స్వర్ణప్రద, ద్వారంపూడి దేవరాజ్‌రెడ్డి, అయ్యప్ప దీక్షాధారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



అత్తిలి: శాఖా గ్రంథాలయ వారోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

తణుకు టౌన్: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని డీవైఈవో డీ మురళీ సత్యనారాయణ తెలిపారు. గురువారం జాతీయ 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో మాజీ భారత ప్రదాని జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా డీవైఈవో మురళీ సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు, బాలలు తమ విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి పుస్తక పఠనం చేయాలన్నారు. మున్సిపల్ మేనేజర్ కే జయకర్ మాట్లాడుతూ గ్రంథాలయాల విశిష్టతను వివరించారు. ఈకార్యక్రమంలో గ్రంథాలయ అధికారి సుగుణకుమారి, న్యాయవాది కె వెంకటేశ్వర్లు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. తణుకు మహిళా గ్రంథాలయం ఆధ్వర్యంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాలను జిల్లా లయన్స్ సభ్యురాలు పుట్టా విజయశ్రీ ప్రారంభించారు. ఈకార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ కార్యదర్శి బసవ శ్రీదేవి, రచయిత్రి యర్రమిల్లి విజయలక్ష్మీ, రిటైర్డ్ గ్రంథాలయ అధికారి ఆర్ నాగమణి, గ్రంథాలయ అధికారి ఎస్ ప్రవీణ తదితరులు పాల్గొన్నారు. తణుకు మండల వేల్పూరు శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా ప్రారంభమయ్యాయి. న్యాయవాది పుట్టా సత్యనారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది పుట్టా సత్యనారాయణ, రిటైర్డ్ ఎంఈవో కోరా సత్యనారాయణ, రిటైర్డ్ ఏఈ కేఆర్ చక్రధర్, వాకలపూడి నాగేశ్వరరావు, గుణ్ణం బసవయ్య, ఇంటి కృష్ణమోహన్, ఉపాధ్యాయులు బీ సత్య గణపతి, అల్లాడ ఉదయలక్ష్మీ, గ్రంథాలయ అధికారి వై సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

బాలబాలికలు గ్రంథపఠనాన్ని అలవర్చుకోవాలి.

అత్తిలి: బాలబాలికలు గ్రంథపఠనాన్ని అలవర్చుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయిని జి విజయలక్ష్మి అన్నారు. అత్తిలి శాఖా గ్రంథాలయంలో గురువారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై లక్ష్మీనారాయణ, గ్రంథాలయాధికారి డి కృష్ణారావు, రిటైర్డు లైబ్రేరియన్ గంధం శేషవేంద్రరావు, రిటైర్డు టీచర్ కె గాబ్రియేల్‌జాన్, గ్రామీణ గ్రంథపాలకులు డి దానకృష్ణ, బి మహాలక్ష్మి, పావని, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. ఆరవల్లి శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయవారోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి.కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కర్రి శ్రీనివాసరెడ్డి, అమృతరావు, ఎస్ఎస్ రెడ్డి, బులివెంకటరెడ్డి పాల్గొన్నారు.



తణుకు టౌన్: పురుషుల గ్రంథాలయంలో మాట్లాడుతున్న డీవైఈవో డీ మురళీ సత్యనారాయణ



తాడేపల్లిగూడెం(టీఓసీ): ఆర్డీఓను సన్మానిస్తున్న దృశ్యం

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని గ్రేడ్-1 శాఖ గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఆర్డీఓ ఖతీబ్ కౌసర్ భానో, మునిసిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబులు ఘనంగా ప్రారంభించారు. గ్రంథాలయాధికారి వి.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గ్రంథాలయాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా ఆర్యవైశ్య మహిళా సంఘం నాయకురాలు ఆలపాటి అచ్యుత లక్ష్మి మాట్లాడుతూ గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను ప్రతి ఒక్కరు చదవాలన్నారు. గరికిపాటి బాపయ్య శర్మ, చంద్రశేఖర్, ప్రత్తి వీరాస్వామి, జనర్ధానరావు పాల్గొన్నారు.

దార్శనికుడు జవహర్ లాల్ నెహ్రూ

తణుకు టౌన్: దేశ స్వాతంత్ర్య పోరాటంలో ప్రత్యేక్షంగా పాల్గొనడంతో పాటు యావదాస్తిని దేశం కోసం సమర్పించిన త్యాగనిరతి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ సొంతమని సాహితీ సామ్రాజ్యం అధ్యక్షుడు తాడినాడ భాస్కరరావు పేర్కొన్నారు. గురువారం జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా తణుకులోని అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన బాలల జయంతి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ప్రదానోపాధ్యాయులు నిమ్మల రామకృష్ణను సత్కరించారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మార్లపూడి దివ్య, చిప్పాడ లక్ష్మీ, చిన్నం సరితా రాణి, కోనార్పు నాగవల్లి, ఏ మేఘన, ఎం లక్ష్మీ, దరంశీ దేవీ, నిమ్మల అమ్మాజీ, ఎస్‌డీ అమీనా, జోగిరెడ్డి, సత్యరెడ్డి, కొండపల్లి హరీష్ కుమార్, బీహెచ్ రామచంద్రరావు, ఎం మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.



రిటైర్డ్ ప్రదానోపాధ్యాయుడు నిమ్మల రామకృష్ణను సత్కరిస్తున్న దృశ్యం

ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

పెంటపాడు: బాలల దినోత్సవం పురస్కరించుకొని గురువారం పలు గ్రామాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలు పాఠశాలలతో పాటు, అంగన్‌వాడీ కేంద్రాలలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విప్పర్రు, జట్లపాలెం, కె. పెంటపాడు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ జీజీబీ విజయలక్ష్మి ఆధ్వర్యంలో పలు కేంద్రాలలో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక భవిత కేంద్రంలో గురువారం బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లలర్పించారు. ప్రాథమిక పాఠశాల హెచ్ఎం బి.జ్యోతి, ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాలీశ్వరయ్య, ఎం.చంద్రకుమారి, దివ్యాంగుల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా స్థానిక పదంకుమార్ గుప్తా వాకర్స్ భవనంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పండిట్ నెహ్రూ జయంతిని నిర్వహించారు. దూలం నాగరాజు, కప్పల నరసింహమూర్తి, రాగిరెడ్డి ప్రసాద్, సత్యనారాయణ పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళిక

తణుకు టౌన్: గ్రామాల్లో పరిపాలన విధానాలు, పంచాయతీ అభివృద్ధిపై నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఆర్ లోహిత్ జయ సాగర్ పేర్కొన్నారు. గురువారం తణుకు మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి సిబ్బంది, గ్రామ, సచివాలయాల కార్యదర్శులకు నిర్వహించిన ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తణుకు మండలాన్ని అభివృద్ధి క్రమంలో నిలిపేందుకు ఉద్యోగులు పని చేయాలని కోరారు. మండల, గ్రామస్థాయిలోని అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేసి మరింత అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఈకార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ రామ్ ప్రసాద్, ఏవో వీ కృష్ణ చంద్రరావు, వివిధ శాఖల అధికారులు, వివిధ గ్రామాల కార్యదర్శులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ సీపీఎం కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా ప్రజా పోరు పేరుతో ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలపై ప్రచారం నిర్వహించినట్లు చెప్పారు. దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి పోతుంటే కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఈ ధర్నాలో సీపీఎం జిల్లా సెక్రటరియేట్ సభ్యులు చింతకాయల బాబూరావు, కర్రి నాగేశ్వరరావు, నాయకులు జవ్వాది శ్రీను, ఎస్.రంగారావు, జి.నాగేశ్వరరావు, శేషు, పోతు శ్రీను పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రజా పోరు

తణుకు: పట్టణంలో ఇటీవల నిర్వహించిన ఇంటింటికీ సీపీఎం కార్యక్రమంలో వచ్చిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి పీవీ ప్రతాప్ డిమాండ్ చేశారు. గురువారం తణుకు తహసీల్దార్ కార్యాలయం వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ తణుకు పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకోవడం కోసం పేదలు నివసించే ప్రాంతాల్లో పర్యటనలు చేసినట్లు చెప్పారు. చాలా మంది ధరలు బాగా పెరిగాయని ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ఏ ప్రభుత్వం ఆయినా ధరలు పెంచడానికి ఉన్న శ్రద్ధ కార్మికులు, పేదల వేతనాలు పెంచడం లేదన్నారు. రోడ్లు, వీధిదీపాలు, పారిశుద్ధ్యం, కుక్కలు, దోమలతో ప్రజలు చాలా అవస్థలు పడుతున్నారని చెప్పారు. అనంతరం తహసీల్దార్ డీవీవీ అశోక్‌వర్మకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు గారరంగారావు, నాగరత్నం, గుబ్బలగోపి, సింగులూరి సత్యనారాయణ, ఎ.కొండయ్య, పి.జయరాజు, ఎం.దుర్గాప్రసాద్, ఎం.వేంకటేష్, ఇ.నాగమణి, పసుపులేటి దుర్గ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

రావిపాడులో కార్తీక వనసమారాధన

పెంటపాడు: మండలంలోని రావిపాడు గ్రామంలో సాయిబాబా ఆలయం వద్ద గురువారం గ్రామస్తుల ఆధ్వర్యంలో భారీ కార్తీక వనసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తొలుత బాబాను దర్శించి ప్రత్యేక పూజలు చేసారు. కార్తీకమాసం సందర్భంగా ఉసిరిచెట్టు వద్ద పూజలు చేసారు. గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

గూడెంలో పాస్టర్స్ దినోత్సవం

పెంటపాడు: ఆద్యాత్మిక క్రీస్తు జీవితాన్ని సేవకులు మాదిరిగా తీసుకొని దేవుని సేవలో ఉన్నతంగా వెలుగొందాలని ఎఈఎల్‌సీ మోడరేటర్ బిషప్ కె. ఫ్రెడ్రిక్ పరదేశిబాబు పేర్కొన్నారు. గూడెం టౌన్ లూథరన్ ఎ.క్లాష్ ప్యారిష్ చర్చిలో గురుమండల అధ్యక్షుడు డీఎల్ ఫీనెహాస్ అధ్యక్షతన రెండు తెలుగు రాష్ట్రాల లూథరన్ పాస్టర్లతో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 26వ పాస్టర్స్ డే వేడుకలను ప్రార్థనలు చేసి ఘనంగా ప్రారంభించారు. సహాయ గురుమండల అధ్యక్షుడు రత్నాకర్, చర్చి చైర్మన్ మానుకొండ భాస్కరరావు, విశాఖ, ఉభయగోదావరి, గుంటూరు ప్రాంతాలకు చెందిన లూథరన్ బిషప్‌లు, సినడు అధ్యక్షులు, పాలకవర్గ సభ్యులు, సేవకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

తణుకు అర్బన్: విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా తణుకు నంబరు 1 మునిసిపల్ పాఠశాలలో గురువారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో న్యాయమూర్తి మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో చిన్న పిల్లలపై కూడా లైంగిక దాడులు పెరిగిపోయాయని, పిల్లలకు మంచి చెడు అనే విషయాలపై అవగాహన కల్పించేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఒంటరిగా బయటకు పంపరాదని అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. 18 సంవత్సరాల్లోపు పిల్లలంతా తప్పనిసరిగా చదువుకోవాలని, నిర్బంధ విద్యా హక్కు చట్టం ఉందని, బాల కార్మికులుగా పిల్లలు పనిచేయుట నేరమని, బాల్య వివాహాలు చేయుట కూడా నేరమని అన్నారు. న్యాయవాది పి.శ్రావణి సమీరా మాట్లాడుతూ ముఖ్యంగా బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అనే అంశంపై అవగాహన కల్పించే విధంగా ఉపాధ్యాయులు చొరవ చూపించాలని అన్నారు. బ్యాడ్ టచ్ అనిపించిన వెంటనే తల్లి తండ్రులకు తెలిపే విధంగా వారిని తీర్చిదిద్దాలని కోరారు. న్యాయవాదులు కొరు వెంకటేశ్వర్లు, ముప్పిడి సుబ్బయ్య, కత్తుల జెస్‌పాల్, టి.సత్యనారాయణరాజు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి డి.సత్యవతి